నగరాభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, జర్నలిస్టులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో : తిరుపతి నగరాభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయడం ఏ మాత్రం తప్పు కాదని అన్ని రాజకీయ పార్టీలు, జర్నలిస్టులు ముక్త కంఠంతో చెప్పాయి. నగరాభివృద్ధికి అడ్డు చెబుతున్న బిజెపి అభ్యంతరాలను లెక్కే పెట్టాల్సిన అవసరం లేదని ఏకగ్రీవ తీర్మానం చేశాయి. టీటీడీ నిధులతో తిరుపతి అభివద్ధి అనే అంశంపై తిరుపతి ప్రెస్‌క్లబ్ మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. తిరుపతి అభివృద్ధికి టీటీడీ ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా తప్పే లేదనిసమావేశం అభిప్రాయపడింది. ఈ విషయంలో బిజెపి రాజకీయ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తింది. తిరుపతిలో 42శాతం టీటీడీ ఆస్తులు ఉన్నా మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయి పన్ను వసూలు చేయడం లేదన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈవిషయంలో బిజెపి విధానం ప్రమాదకరమని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. 28.5.1987న ప్రభుత్వం ఆమోదించిన టీటీడీ చట్టంలోని 146వ పేజీ 111 పాయింట్‌లో టీటీడీ తిరుపతి నగరంలో భక్తులు, యాత్రికుల కోసం తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం కోసం నిధులు ఖర్చు చేయవచ్చని స్పష్టంగా ఉందనే విషయం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి తెలియజేశారు. ఈఅంశంపై చర్చే దౌర్భాగ్యమని, జెరూసలెం నగరాభివృద్ధికి అక్కడి అన్ని మత సంస్థలు, వాటికన్ సిటీ అభివృద్ధికి పోప్ సంస్థానం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయనే విషయం బిజెపి నాయకులు తెలుసుకుంటే మంచిదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కందారపు మురళి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చినబాబు మాట్లాడుతూ, తిరుపతి అభివద్ధి కి టీటీడీ ఎన్ని నిధులు అయినా ఖర్చు చేయవచ్చని చెప్పారు. తమ పార్టీ విధానం కూడా అదేనని వెల్లడించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, అజయ్, వాసు యాదవ్, ఆర్పీఐ పార్టీ నాయకుడు ఆంజయ్య, సిపిఐ నాయకుడు మురళి, రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి,బి ఆర్ఎస్ నాయకుడు కృష్ణ ప్రసాద్‌తో పాటు పలువురు జర్నలిస్టులు తిరుపతి అభివృద్ధికి, పారిశుధ్య నిర్వహణకు నిధులు ఇవ్వాలని టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టులు

ఒంటరిగా బిజెపి

తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ వార్షిక బడ్జెట్ నుండి 1 శాతం నిధులు రాకుండా అడ్డుపడిన బిజెపి ఒంటరిగా మిగిలింది. ఇప్పుడు తిరుపతి నగర పారిశుధ్య నిర్వహణకు కూడా టీటీడీ నిధులు ఇవ్వరాదని వితండ వాదానికి దిగి పరువు పోగొట్టుకుంది. ఆ పార్టీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి ఈ విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై బిజెపిలోని ఒక వర్గం కూడా గుర్రుగా ఉంది. బిజెపి మిత్రపక్షం జనసేన కూడా టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. అఖిలపక్ష సమావేశానికి కొన్ని రోజుల ముందే ఆ పార్టీ తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్ ఇందుకు సంబంధించి తమ పార్టీ విధానం వివరిస్తూ ఒక వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఇతర రాజకీయ పక్షాలు, స్థానిక జర్నలిస్టులు కూడా తిరుపతి నగర అభివృద్ధికి, పారిశుధ్య నిర్వహణకు టీటీడీ నిధులు ఇవ్వాల్సిందేనని ఏకగ్రీవ తీర్మానం చేయడం భారతీయ జనతా పార్టీకి నోట్లో వెలక్కాయ పడినట్లే.

ఆంధ్రజ్యోతి, ఈనాడు పై ఆగ్రహం

తిరుపతి నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణకు టీటీడీ నిధులు కేటాయించడాన్ని తప్పు పడుతూ ఆంధ్రజ్యోతి, ఈనాడు వండి వార్చుతున్న కథనాలను సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రజలకు దురభిప్రాయం కల్పించేందుకు రాస్తున్న రాతలకు స్పందన లేకపోవడంతో ఈ నిధుల విడుదలలో అవినీతి జరిగిందనే తప్పుడు కథనాలను రాయడంపై అఖిలపక్ష సమావేశం తీవ్రఅభ్యంతరం తెలిపింది.

నిర్లక్ష్యం నీడలో మంగళం ఆర్టీసీ డిపో

- కూలిన 100 అడుగుల ప్రహరీ గోడ
- కోట్లు విలువ చేసే సామగ్రికి భద్రత ఏదీ?

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

బస్సుల మరమ్మతులకు అవసరమైన కోట్లు విలువ చేసే సామగ్రిని ఉంచే ప్రదేశం, బస్సులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లి రావడానికి సరిపడినంత ఇంధనాన్ని నింపే చోటుకే రక్షణ లేకుండా పోయింది. ప్రజారవాణా అధికారులు తమకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం తిరుపతి- కరకంబాడీ మార్గంలోని మంగళం ఆర్టీసీ డిపో నిర్లక్ష్యం నీడలో ఉందనే చెప్పాలి. తొమ్మిది ఏళ్ల క్రితం డిపోలో కోట్లు విలువ చేసే సామాగ్రి ఉంచాల్సి ఉంటుందని అధికారులు భారీ ప్రహరీని ఏర్పాటు చేశారు. నిర్మాణంలో నాణ్యత లేకపోవడం కారణం కావచ్చు, ప్రకతి పరిణామాలు కావచ్చు, దాదాపు 100 అడుగులకు పైగా డిపో ప్రహరీగోడ మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కుప్పకూలిపోయింది. కొద్ది నెలల క్రితం వర్షం కురవడంతో డిపోకు దక్షిణ బాగాన దాదాపు 60 నుంచి 70 అడుగులకు పైగా ప్రహరీ గోడ కూలిపోయింది. అయితే డిపోలో కోట్లు విలువ చేసే సామాగ్రి ఉన్న అధికారులు మాత్రం పట్టనట్టుగా సాధారణ సిమెంట్ రేకులను తీసుకువచ్చి అడ్డుపెట్టి మమా అనిపించేశారు. ప్రస్తుతం మంగళవారం ప్రహరీగోడ కూలిపోయిన ప్రాంతంలో పచ్చటి తెరను కట్టి ఉంచారు. కొద్దినెలల క్రితం కుప్పకూలిన ప్రహరీ గోడ నాణ్యతా లోపం కారణంగా కూలిపోయిందా లేక బలమైన వర్షాల కారణంగా కూలిపోయిందా కూడా ఇంతవరకు డిపో అధికారులు బయటి ప్రపంచానికి ఎటువంటి ప్రకటన ఇప్పటివరకు చేయలేదు. దక్షిణ వైపున ప్రహరీగోడ కూలిన తరువాత ప్రజారవాణా ఇంజనీరింగ్ అధికారులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించి ఉంటే ఈపాటికి గోడ ఎందుకు కూలిందో నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు చేరేది. కోట్లు విలువైన బస్సులకు వినియోగించే సామగ్రికి భద్రత కల్పించడంలో అధికారులు ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాత్కాలిక మరమ్మతుల వైపు అధికారులు ఎందుకు మొగ్గు చూపుతున్నారో... ప్రహరీ నిర్మాణం నాణ్యత పరిశీలించి పూర్తిస్థాయిలో బలమైన ప్రహరీ గోడను నిర్మించడానికి అధికారులు ఎందుకు ఉపక్రమించడం లేదో అర్థం కావడం లేదు. దక్షిణ వైపు కూలిన ప్రహరీగోడ పునర్నిర్మాణం ఎప్పుడు చేపడతారు అనే విషయాన్ని ప్రజాశక్తి ఆనాడే డిపో మేనేజర్ భాస్కర్ నాయుడును ప్రశ్నించింది. అప్పుడు ఇప్పుడు డిపో మేనేజర్ భాస్కర్ నాయుడు ఒకే మాట... ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇచ్చాం... వారు వచ్చి పరిశీలించి తదుపరి చర్యలు చేపడతారని సమాధానం ఇస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది. ప్రజారవాణా ఉన్నతాధికారులైన మంగళం డిపో బాగోగులపై ఇప్పటికైనా దష్టి సారించి, పటిష్టమైన ప్రహరీ గోడను నిర్మాణం చేయాలని పలువురు వాపోతున్నారు.

తాత్కాలిక చర్యలు చేపట్టాం...

- భాస్కర్ నాయుడు, మంగళం డిపో మేనేజర్

ప్రస్తుతం మంగళం డిపోకు తూర్పు వైపుగా కూలిన గోడ ప్రదేశంలో తాత్కాలికంగా తెరను ఏర్పాటు చేశాం. రెండు పక్కల గోడ కూలిపోవడంతో నేను ఇంజనీరింగ్ అధికారులను త్వరగా నిర్ణయం తీసుకుని గోడ నిర్మాణం చేపట్టేలా ప్రయత్నాలు సాగిస్తాను.

కూలిన 100 అడుగుల ప్రహరీ గోడ

శివయ్య సేవలో సాయి ధరమ్‌తేజ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ప్రముఖ టాలీవుడ్ హీరో సాయి ధరమ్ తేజ్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, అంజూరు శ్రీనివాసులు ముక్కంటి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆహార నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

వారం రోజులు ఫ్రిజ్‌లో ఉన్న మాంసాన్ని స్వాధీనం చేసుకున్న హెల్త్ ఆఫిసర్ అన్వేష్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి పుణ్యక్షేత్రంలోని హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో విక్రయించే ఆహారంలో నాణ్యతపరమైన ప్రమాణాలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్‌ఆఫిసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఫుడ్‌సేఫ్టి ఆఫీసర్ మద్దిలేటి హెచ్చరించారు. తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ వద్ద ఉన్న బార్బీ క్యూనేషన్, మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో నాణ్యత లేకుండా ఫుడ్ అమ్ముతున్నారనే ఫిర్యాదు రావడంతో మంగళవారం మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటిలు హోటల్లోని వంట గదులను తనిఖీచేసి పాచిన పదార్థాలు, వారం రోజుల క్రితం ఫ్రిజర్లో ఉంచిన మాంసంను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు తరిలించి, సంబంధిత హోటల్స్‌కు నోటీసులు జారీచేసి జరిమానా విధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆరోగ్య అధికారి అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రజలకు నాణ్యతలేని ఆహారం అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తే కమిషనర్ హరిత ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, శానిటరీ ఇన్స్ స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో రద్దీ సాధారణం

హుండీ ఆదాయం రూ.3.5కోట్లు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తులు రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనానికి 9 కంపార్టుమెంట్‌లలో వేచియుండగా దర్శనానికి 4 గంటల సమయం పడుతుంది. మంగళవారం సాయంత్రం వరకు హుండీ లెక్కింపులో 3.5కోట్లు భక్తులు కానుకలను సమర్పించారు.

డిసెంబర్ నెలలో విశేష ఉత్సవాలు

ప్రజాశక్తి- తిరుమల: డిసెంబర్ నెలలో తిరుమల కొండపై విశేష ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవ వివరాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది.తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు నెలలో జరుగనున్న విశేష ఉత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి. 3న పార్వేట మండపంలో కార్తీక వనభోజన ఉత్సవం, 8న సర్వ ఏకాదశి, 12న అధ్యయనోత్సవాలు ప్రారంభం, 17న ధనుర్మాసం ప్రారంభం, 22న తిరుమల శ్రీవారి సన్నిధిలో చిన్న శాత్తుమొర, 23న వైకుంఠ ఏకాదశి, శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం. స్వర్ణరథోత్సవం, 24న వైకుంఠ ద్వాదశి నాడు శ్రీవారి చక్రస్నానం, శ్రీస్వామి పుష్కరిణితీర్థ ముక్కోటి, 28న శ్రీవారి ఆలయంలో ప్రణయకలహ మహోత్సవం.

'అభివృద్ధిని అడ్డుకుంటే తిరుగుబాటు తప్పదు'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

తిరుపతి నగర అభివృద్ధికి టిటిడి ఒక శాతం నిధులను కేటాయిస్తూ తీసుకున్న తీర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న బిజెపి నాయకులకు నగరంలో తిరుగుబాటు తప్పదని వైసిపి నాయకురాలు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్ దూరదష్టితో నగరాన్ని చరిత్రపుటల్లో నిలిపే విధంగా అభివద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. నగరాభివృద్ధిని చూసి ఓర్వలేక బిజెపి నాయకులు భానుప్రకాష్ రెడ్డి అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. తెలంగాణలోని భద్రాచలం ఆలయానికి రూ.2కోట్లు అప్పు ఉండగా టీటీడీ చెల్లించిన విషయాన్ని బిజెపి నాయకులు గుర్తుంచుకోవాలని, అప్పుడు అడ్డుకోని బీజేపీ నాయకులు యాత్రికుల సౌకర్యాలను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు నగరాభివృద్ధికి సహకారం అందించకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్పొరేటర్ దూది కుమారి, తాతయ్యగుంట గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ గౌరీ, పెద్ద గంగమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ పద్మజ, వార్డు సభ్యురాలు మంజుల పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు కులగణన తప్పనిసరి: ఎంపి రెడ్డెప్ప

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికే

రాష్ట్ర కులగణన ప్రాంతీయ అవగాహనా సదస్సు: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తొమ్మిది దశాబ్దాల కాలం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం కులగణన చేపట్టడం పేదవారి అభ్యున్నతికి దోహదం చేస్తుందని ప్రాంతీయ సదస్సుకు అధ్యక్షత వహించిన తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన -2023 ఆవశ్యకత పై తిరుపతి, యస్‌పియస్‌ఆర్ నెల్లూరు, చిత్తూరు, వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల ప్రాంతీయ సదస్సును మంగళవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించగా ప్రజాప్రతినిధులు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలుగా కుల గణన జరగలేదని, మనదేశంలో 1872లో తొలిసారిగా జన గణన ప్రారంభమైందన్నారు. 1931లో కుల గణనతో కూడిన జన గణన జరిగిందని, తరువాత కాలంలో ఎస్సీ, ఎస్టీ కులాల మినహా మిగిలిన వారిని జనరల్ కేటగిరీ కింద లెక్కిస్తూ వస్తున్నారని అన్నారు. ఆ తరువాత చేపట్టిన జనాభా గణనలో గత గణనలు ఆధారంగా పరిశీలనలోకి తీసుకొని వందశాతం మేరకు పెరుగుతూ వచ్చేదని అన్నారు. అలాకాకుండా శాస్త్రీయంగా వాస్తవంగా ఉన్న కులాల వారి జనాభాను గుర్తించడానికి మన ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిందని అన్నారు. 1931లో మన దేశ జనాభా 30 కోట్లు కాగా నేడు 140కోట్లుగా ఉందని, కులాల వారి జనాభా లెక్కించడం వలన ప్రస్తుత కులాల వారీగా వారి సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి తెలుసుకోవడం వారి కోసం సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి, ప్రభుత్వ పథకాలు రూపకల్పనకు ఉపయోగపడనున్నది. సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు ప్రజలు తమ సందేశాలను ఇవ్వాలని రాతపూర్వకంగా ఇచ్చిన వినతులను కూడా పరిగణంలోకి తీసుకొని నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని వివరించారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభ 2021లో సాధారణ జనాభా గణన 2021తోపాటు కులగణన చేపట్టాలని తీర్మానం ఆమోదించిందని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందని గుర్తుచేశారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అంతరాలు తొలగాలని నిర్ణయించిన మేరకు నేడు నేను ఈ పదవిని వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో చేపట్టానని అన్నారు. బడుగు బలహీన వర్గాలలో ఉన్న అంతరాలు తొలగిపోవాలని, నేడు ఈ కులగణన చేపట్టడం సమసమాజ స్థాపనకు దోహదపడుతుందని సహకరించాలని అన్నారు. రాష్ట్ర శాసనమండలి సభ్యులు సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవం కల్పించిన వ్యక్తిని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వము చేపట్టని విధంగా రాష్ట్రంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ ఆర్థిక సమానత్వం కల్పించారని అన్నారు. కులగణన వల్ల ప్రయోజనం ఉంటుందని మన పక్క రాష్ట్రం తమిళనాడులో 1980లో జరిపారని అప్పటి లెక్కల ప్రకారం బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతం ఆ రాష్ట్రం పెంచిందని, దీనివల్ల సమానత్వం సాధించగలుగుతామని అన్నారు. తిరుపతి నగర మేయర్ శిరీష మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగాలంటే తప్పనిసరి కులగణన అవసరమని ఎన్నో సర్వే సంస్థలు చెబుతున్నాయని అన్నారు. కులగణన కచ్చితమైన డేటా ఉంటేనే ఆర్థికంగా రాజకీయంగా రాబోవు తరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. చిత్తూరు నగర మేయర్ అముద మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అందువల్లే ఎంతో మంది బడుగు బలహీన వర్గాల మహిళలకు పెద్దపీట వేసి పదవులు కట్టబెట్టారని అందులో నేను ఒకరిని మా కులాల వారు నాకు కట్టబెట్టిన ఈ పదవికి రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారని అన్నారు. కులగణన అనివార్యమని, శాస్త్రీయ గణాంకాలు అవసరమని సమసమాజానికి ఉపయోగమని తప్పనిసరి చేపట్టాలని అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సర్వే అధికారులకు మంచి శిక్షణ ఉండాలని సూచించారు. ఈ సదస్సులో వివిధ జిల్లాల నుండి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు లక్ష్మయ్య, పుల్లయ్య, సురేంద్రనాథ్, కుమార్ రాజా, శాంతి, బాబు, ముస్లిం పెద్దలు, శ్రీరాములు, వేమ నారాయణ, తమ అభిప్రాయాలను, కులాల జీవన విధానం వేదికపై తెలియజేశారు. ఈసదస్సులో తిరుపతి కుల గణన అధికారి జిల్లా జెసి డికె.బాలాజీ, విసి భారతి, కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషగిరి, ఎండి కష్ణమూర్తి, చిత్తూరు డిఆర్ఓ రాజశేఖర్, చిత్తూరు జిల్లా కులగణన అధికారి జెడ్పిసిఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు డైరెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులు విద్యలో రాణించి చరిత్ర సష్టించాలి : ఆర్‌కె రోజా

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో పూర్వవిద్యార్థినుల సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్: విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా ధైర్యంగా ముందడుగు వేసి అనుకున్న రంగంలో రాణించి చరిత్ర సష్టించాలని రాష్ట్రమంత్రి ఆర్‌కె.రోజా పిలుపునిచ్చారు. తిరుపతిలోని టీటీడీకి చెందిన శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో మంగళవారం వార్షిక పూర్వవిద్యార్థినుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థిని, రాష్ట్రమంత్రి ఆర్‌కె.రోజా విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవారి పాదాల చెంతగల ఈ కళాశాలలో చదువుకోవడం విద్యార్థినుల పూర్వజన్మ సుకతమన్నారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత తిరిగి కళాశాలలో తన గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళావిద్యను ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దాన్ని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలన్నారు. అనుకున్న స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తాను ఈ స్థాయికి రావడానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. మరో పూర్వవిద్యార్థి, తిరుపతికి చెందిన ప్రముఖవైద్యురాలు డాక్టర్ కష్ణప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థినులకు ఏకాగ్రత ముఖ్యమని, దాన్ని పెంపొందించుకుంటే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి డాక్టర్ డిఎం.ప్రేమావతి మాట్లాడుతూ 70 ఏళ్ల అపూర్వమైన చరిత్ర కళాశాల సొంతమని, వేలాది మంది విద్యార్థినులను విద్యావంతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న విద్యార్థినులు చాలా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందని, అటానమస్ దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. అనంతరం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహదేవమ్మ, అల్యూమినీ ప్రెసిడెంట్ వసుధ, వార్డెన్ విద్యుల్లత, తెలుగు అధ్యాపకురాలు డా.కష్ణవేణి, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, అధ్యాపకులు, పూర్వవిద్యార్థినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాను అరికట్టండి :డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో చంద్రగిరి, తిరుపతిలో గంజాయి, డ్రగ్స్ విపరీతంగా దొరుకుతున్నాయని వాటిని అరికట్టాలని, యువతరం జీవితాలతో చెలగాటం ఆడుతూ బానిసలుగా చేసిన వారి పైన కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర, జిల్లా కార్యదర్శి కె.సుమన్ తిరుపతి రెవెన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. తిరుపతి, చంద్రగిరి ప్రాంతంలో డ్రగ్స్ విపరీతంగా ఎక్కడపడితే అక్కడ దొరుకుతున్నాయన్నారు. కళాశాల విద్యార్థులు విచ్చలవిడిగా కొనుక్కొని సిగరెట్లలో చుట్టుకొని తాగుతూ ఆ మత్తులో ఏం చేస్తున్నారో వాళ్ళకే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిని అరికట్టాల్సిన యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని అన్నారు. ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణాలు మొదలుకొని పల్లెపల్లెకు, కాలేజీల నుంచి పాఠశాలకు గంజాయిని అరికట్టడంలో ఘోరంగా విఫలమైన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం వారి జీవితాలను నాశనం చేసే గంజాయిని మాత్రం అరికట్టలేకపోయిందని విమర్శించారు. విద్యార్థులు భవిష్యత్తు నాశనం అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే స్పందించి గంజాయి కాలేజీ, హాస్టళ్లలోకి ఎలా వచ్చిందో విచారణ జరిపి బాధ్యులపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థులకు, యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి తరచుగా హాస్టళ్లు పరివేక్షించాలని కోరారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై, వారికి అండగా ఉండే రాజకీయ నాయకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు.


ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు జయచంద్ర, సుమన్

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా లోగోను ఆవిష్కరించిన జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో 15 సంవత్సరాలు పైబడిన యువతను క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించటం, క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకోవాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' అనే క్రీడాపోటీలను గ్రామీణ, వార్డు, మండల, నియోజకవర్గ, రాష్ట్రస్థాయిలలో డిసెంబర్ 15 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్, ఛైర్మన్, డిఎస్ఎ కె.వెంకట రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు 51 రోజుల పాటు జిల్లాలోని 691 గ్రామ,వార్డు సచివాలయంలో మ్యాచ్‌లు నిర్వహించబడతాయని అన్నారు. ఎంపిక చేసిన ఐదు క్రీడాంశాలు పోటీ క్రీడలు (క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో) పోటీలేని క్రీడలు (యోగ, టెన్నికాయిట్, మారథాన్) క్రీడలను నిర్వహించబడుతుందని మొదటిగా గ్రామ, వార్డుస్థాయి పోటీలు నిర్వహించబడతాయని ఇందులో గెలుపొందిన జట్టుమండల స్థాయికి ఎంపిక అవుతుందని, మండలస్థాయి గెలుపొందిన జట్టు నియోజకవర్గస్థాయికి, నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్టు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్టు రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీస్, పతకాలు అందచేయటం జరుగుతుందన్నారు. ఈపోటీల నిర్వహణకు కావలసిన క్రీడా సామగ్రి అన్ని జిల్లాలో అందచేయడం జరగిందని, పోటీల నిర్వహణకు కావలసిన మైదానాలు, స్టేడియాలు సంసిద్ధం చేయడం జిల్లాలో పూర్తికావస్తోదని తెలిపారు. అలాగే ఆడుదాం ఆంధ్రటోర్నమెంట్‌కి సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ఈనెల 27వ తేదీ సోమవారం నుండి జరుగుతుందని శాప్‌వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం సూచనలు జారీ చేశారని తెలిపారు. రిజిస్టర్ చేసుకునేవారు మీకు సమీపంలో ఉన్న సచివాలయంలో నమోదు చేసుకొవచ్చు అని, క్రీడలలో పోటీ చేయు వారు పేరు నమోదు కోసం 1902కి కాల్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

సాంకేతిక లోపాలతో అడ్డదారులు

విజిలెన్స్ అదుపులో దళారీ

ప్రజాశక్తి- తిరుమల: ఓ వ్యక్తి నకిలీ గుర్తింపు కార్డులతో 70 తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు నమోదు చేశాడు. నిందితుడిని గుంటూరుకు చెందిన రసూల్‌గా టిటిడి విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదుతో తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. టిటిడి వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపమే కారణమని అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న డిఇవో శేఖర్

'నాడు నేడు' పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: డిఇవో

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిఇవో వి శేఖర్ ఆదేశించారు. పిచ్చాటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇవో డాక్టర్ వి శేఖర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న నాడు, నేడు ఫేస్ 1 ఫేస్ 2 పనులపై ఆరా తీశారు. నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం చారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి కొన్ని ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ట్యాబ్ లను జిల్లా విద్యాశాఖాధికారి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యుగంధర్ రాజు, ప్రధానోపాధ్యాయులు గిరిప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి భావంతులైన క్రీడాకారులను కనుగొని వారిని పెద్ద వేదికకు పరిచయం చేయడం, క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ లు నిర్వహించేందుకు మంగళవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభించారని ఎంపిడిఓ దేవేంద్ర బాబు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 2023 డిసెంబరు 15 తేదీ నుండి 2024 ఫిబ్రవరి 3 వ తేదీ వరకు జరిగే ఈ రాష్ట్ర వ్యాప్త టోర్నీకి ముందు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ కోసం దగ్గర లోని సచి వాలయంలో సంప్రదించాలని, లేదంటే 1902 కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 15 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులు పాల్గొని తమకు ఆసక్తిగల ' క్రీడల్లోని నైపుణ్యాన్ని ప్రదర్శిం చాలని కోరారు.

శ్రీ ప్రగతి డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

శ్రీ ప్రగతి డిగ్రీ కళాశాల ప్రాంగణ ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్రీ ప్రగ తి డిగ్రీ కళాశాలలో గత సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన వారికి, ప్రస్తుతం చివరి సంవ త్సరం చదువు తున్న విద్యార్థులకు టెక్ మహీంద్ర, ఆల్ సెట్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ఆధ్వర్యంలో కంపెనీల హెచ్ఆర్లు ఎంపికకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో శ్రీ ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 28 మంది ఎంపికైనట్లు శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తెలిపారు. ఎంపికైన వారు 2 లక్షల రూపాయల వార్షిక వేతనంతో చెన్నై బ్రాంచిలలో పని చేస్తారని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు డిగ్రీతో పాటు అవకాశాలు కల్పిం చడం అభినంద నీయమని, అంతేకాకుండా చిన్న వయస్సులో ఉద్యోగ అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో కంపెనీల హెచ్ఆర్ లు ఉదయ, భారతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మత్స్యకార సంఘం సభ్యులు

ప్రజాశక్తి-తడ: మండల వైసిపి కన్వీనర్ కెలివి ఆర్ముగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన మత్స్యకార కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సంజీవయ్య ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకార నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందని తీర ప్రాంతంలో మత్స్యకారులకు జీవన ఉపాధికి అక్కడక్కడా శాంతి పులికాట్ సరస్సు పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. మత్స్యకారులకు మునుపెన్నడూ లేని విధంగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కు ఆరోగ్యం ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గేట్ పుత్తూరులో మంగళవారం నిర్వహించిన మసీద్- ఎ- ముబారక్ (మసీదు)లో హమ్ సెల్ జగన్ బెర్ రోజుల్ కె సాత్ విస్తృత ప్రచారం లో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వి.ఏం మహీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోని ముస్లిం ల కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషి మన నియోజకవర్గంలో మంత్రి ఆర్కే రోజా చేస్తున్న అభివృద్ధి గురించి వివరంగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా అపూర్వమైన ఒక షాదీ ముబారక్ ముస్లిం కోసం నిర్మించి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని, రానున్న ఎన్నికలలో ప్రతి ముస్లిం సోదరుడు అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

సంక్షేమమే జగన్ లక్ష్యం: ఎంపిపి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెరిమిడిలో 'ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలి?' అనే కార్యక్రమం వెంకటగిరి నియోజకవర్గం కన్వీనర్ జిల్లా, వైసిపి అధ్యక్షుడు రామ్ కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా వాలంటరీ వ్యవస్థని ప్రవేశపెట్టి అందేలా వుంటానని భరోసా ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయం అధ్యక్షులు తాళ్లూరు వెంకట బయన్న, ప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

కోట : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని వైసిపి యువ నాయకులు నేదురుమల్లి హరిచంద్రా రెడ్డి అన్నారు. కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం సచివాలయం కేంద్రంలో 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి?' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నేదురుమల్లి హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ ముందుగా గ్రామ సచివాలయంలో అభివృద్ధిపొందిన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి, వైసిపి నాయకులు, కార్యకర్తలతో వైసీపీ జెండాను ఆవిష్కరించారు. వై ఏపీ నీడ్స్ జగన్? ఎందుకో వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, కోట ఎంపీటీసీ షేక్.మెహబూబ్ బాష, వైసిపి నాయకులు, పెనుబోలు దయాకర్ రెడ్డి, శానంపూడి గోపాల్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, కట్టా శంకర్ రెడ్డి, నేదురుమల్లి హరి ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో భవాని, ఈవోపిఆర్డీ షేక్ నయూమ్, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

టీచర్లను వేధించొద్దు: ఆపస్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చిన్న చిన్న కారణాలతో టీచర్లను వేధించొద్దని, నోట్స్ లను ఓవర్ చెకింగ్, వర్క్ బుక్స్ రాయించ లేదని, బైజూస్ యాప్ వాడలేదని, ప్రశ్నా పత్రాన్ని సరిగా మూల్యాంకనం చేయలేదని ఇలా చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు, ఛార్జ్ మెమోలు, సస్పెన్షన్లు చేసి వేధించడం సరికాదని ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో పనిచేసే విధంగా వారికి స్వేచ్ఛని ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలో నిర్వహించిన ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శ్రీనివాసులు గారి

ఆపస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

బాలాజీని రాష్ట్ర అధ్యక్షులుగా, గంగరాజు దొరస్వామిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న సందర్భంగా పుత్తూరు లో ఆపస్ బాధ్యులు వారికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా నిరంతరం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎల్లప్పుడూ తెలుపుకుంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. డిపిఎస్ రద్దు పాత పెన్షన్ అమలు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ స్కీమ్ , ఆర్థిక బకాయిల చెల్లింపు, ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన, తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ తేజోమూర్తి, ధనంజయలు, దశరథ్, గురప్ప, లోకేష్, చక్రపాణి, జయకర్, మనోజ్, గిరి, కన్నయ్య పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: అణగారిన వర్గాల ఆశా జ్యోతి, సామాజిక అసమానతలను రూపు మాపేందుకు కృషి చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతి రావు పూలే అని కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళ వారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, డిఆర్ఓ పెంచల కిషోర్, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధికార ఇన్ఛార్జి అధికారి భాస్కర్ రెడ్డి ఇతర అధికారులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యమకర్త, సంఘసేవకుడు, సామాజిక తత్వవేత్త, మహిళా అభ్యుదయ వాది, నిరంతరం మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే ను యువత ఆదర్శంగా తీసుకో వాలన్నారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్య నారాయణ, ఏబిసిడబ్ల్యుఓ కృష్ణయ్య, వెంకటేష్, జ్యోత్స్న, బిసి సంక్షేమ శాఖ, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు సమీపంలో పూలే విగ్రహానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అందరూ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మురళి, గోవి రమణయ్య, మోబిన్ బాష, బాలకృష్ణా రెడ్డి, బాస్కర్ గౌడ్, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

రేణిగుంట : మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని రేణిగుంట పట్టణంలో ఏర్పాటు చేయాలని బిసి సంఘర్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూల వెంకటాద్రి యాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలను ఎస్వీయూలోని బీఈడీ కళాశాలలో ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ వియూ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జానకి రామయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ గౌడ్, పవన్, చందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: సమాజంలో అసమానతల నిర్మూలనకు మహాత్మా జ్యోతిభా పూలే ఎనలేని కృషి చేశారని ఎపిఎస్ పిడిసిఎల్ డైరెక్టర్లు విఎన్ బాబు, ఎన్విఎస్ సుబ్బరాజులు పేర్కొన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మహాత్మా జ్యోతిభా పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ (ఫైనాన్స్)

జ్యోతి రావు పూలేకు నివాళులర్పిస్తున్న ఎపిఎస్ పిడిసిఎల్ కార్యాలయ సిబ్బంది

వి.ఎన్. బాబు, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్డి) ఎన్విఎస్ సుబ్బరాజు, డైరెక్టర్ ఎన్. శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు వై. లక్ష్మీ నరసయ్య, కె. గురవయ్య, జాయింట్ సెక్రటరీ ఎ. రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు గోపాల కృష్ణ, చంద్ర శేఖర రావు, రామచంద్ర రావు, శోభావాలంటీనా, సురేంద్రరావు, శ్రీకాంత్, శ్రీనివాసబాబు, బిసి ఎంప్లాయిస్ అసోసి యేషన్ నాయకులు చలపతి, జగదీష్ పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతి నగర పరిధిలోని బాలాజీ కాలనీ వద్ద ఉన్న పూలే విగ్రహానికి మంగళవారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు, ఈడిగ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ శాంతకుమారి, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ జ్ఞాన జగదీష్, తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మధు ఆచారి, వాసు, జయచంద్ర, బీసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట : కోట బీసీ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

భూమిని కబ్జా చేశాడు..న్యాయం చేయండి..

ఎస్ఐకి బాధితుడు వినతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: వారసత్వంగా తనకు సంక్రమించిన భూమిలో అగ్రవర్ణాల వారు దౌర్జన్యం చేస్తూ తన భూమిని కాజేసేందుకు యత్నిస్తు న్నారని దీన్ని నిలదీస్తే కులం పేరుతో దూషిస్తూ తన భార్యపై దౌర్జన్యం చేస్తున్నారని తనకు న్యాయం చేయాలని మండలంలోని కుంబాకం గ్రామ దళితవాడకు చెందిన బుర్ర వేణు పోలీసులకు మంగళవారం వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా బాధి తుడు వేణు మాట్లాడుతూ కుంబాకం గ్రామ రెవెన్యూ లో సర్వే నెంబరు 301/8ఎ పట్టా నెంబరుతో ఒకటిన్నర ఎకరా భూమిని ప్రభుత్వం 1995 లో తల్లి బుర్ర వెంకటసుబ్బమ్మ భర్త కృష్ణయ్య పేరుతో ప్రభుత్వ భూమి ఒకటిన్నర ఎకరా పట్టా ఇచ్చారని తెలిపారు. ఆ భూమిని అప్పట్నుంచి తమ తల్లిదండ్రులు సాగు చేసుకుంటూ ఆ భూమిపై వస్తున్న ప్రభుత్వ పథకాలు బ్యాంకు లోన్, రైతు భరోసా, పిఎం కిసాన్, పురుగు మందులు వగైరాలు అనుభవిస్తూ వచ్చారన్నారు. దీనికి వారసుడైన తాను తల్లిదండ్రుల మరణా నంతరం ఈ బుక్కులు వన్‌బి అడంగాలు ఆధారాలతో తన పేరున మార్చుకుని ప్రభుత్వ పథకాలు అన్ని పొందుతున్నానని తెలిపాడు. ప్రస్తుతం తన భూమిపై అగ్ర వర్ణానికి చెందిన తెల్లాకుల చెంగల్ రాయి శెట్టి కుమారుడు తెల్లాకుల వేణుగోపాల శెట్టి అతని భార్య, కుమారుడు తన భూమిలో దౌర్జన్యంగా దున్నుతుంటే తాము అడ్డు కున్నామన్నాడు. దీంతో మరో అగ్ర వర్ణాల వారికి డబ్బు ఆశ చూపించి సుమారు 50 మందిని తమపైకి దౌర్జన్యానికి పంపించి ' ఇది మా భూమి..నీకు ఇక్కడ పొలాలు లేవు..' అని బెదిరించి తరిమి వేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తర్వాత తాను కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నానని తెలిపాడు. ఇంజక్షన్ ఆర్డర్‌ను, తన తల్లి పేరుతో వున్న డాన్ డాక్యుమెంటేషన్ మొత్తం తహశీల్దారు, పోలీసు కార్యా లయంలోనూ సమర్పిం చుకున్నానని తెలిపాడు. అయినా తనకు న్యాయం జరగలేదన్నాడు. అన్ని ఆధారాలు వున్న తన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకుని తగిన న్యాయం చేయాలని పోలీసులను, అధికారులను అభ్యర్థించాడు. వెంటనే తన భూమిని తనకు అప్పగించాలని కోరాడు.

జగనన్న పాలనలోనే భూ సంస్కరణలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కెవిబిపురం: జగనన్న పాలనలో భూ సంస్కరణలు ప్రతిష్టాత్మకంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం కేవీబీ పురం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పేదలకు భూ పంపిణీ, కళ్యాణ మస్తు, షాది తోఫా నగదు జమ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 58 మంది పట్టాలు పంపిణీ చేశారు. కొత్తగా పెళ్లయిన 51 జంటలకు కళ్యాణమస్తు, షాది తోఫా ద్వారా రూ.38 లక్షల 48 వేలు మెగా చెక్కును ఎమ్మెల్యే ఆదిమూలం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలోని తహశీల్దారులు త్వరిత గతిన భూమిలేని పేదలకు పట్టాలు, డికెటి భూములకు సెటిల్మెంట్ పట్టాలు పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు తాము అందిస్తామన్నారు. భూ పంపిణీ లో ఎక్కడా లంచాలకు తావు లేకుండా అధికారులు పారదర్శకతను పాటించాలని, అర్హులైన లబ్దిదారులకు మాత్రమే భూమి అందేలా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తమపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ముని లక్ష్మీ నంద కుమార్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, తహశీల్దారు శ్రీదేవి, ఎంపీడీవో రామచంద్రయ్య, అధికారులు, ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: జగనన్న పాలనలో భూ సంస్కరణలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం స్థానిక తహశీ ల్దారు కార్యాలయంలో 11 మంది భూమిలేని నిరుపేదలకు 4.17 ఎకరాల అసైన్మెంట్ భూమిని పంపిణీ చేశారు. అనంతరం డి కే టి పట్టాలు కలిగిన 410 మందికి 384.74 ఎకరాల భూమి రిజిస్టర్ చేసిన సెటిల్మెంట్ పట్టాలను, బంగాళ, పులి కుండ్రం గ్రామాలలో నాల్గు శ్మశాన వాటికలకు 1.5 ఎకరాల భూమిని కేటా యించారు.17 మంది ఎస్సీ మార్టిగేజ్ డీడ్ లబ్ధిదారులకు 8.15 ఎకరాల భూమిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. 30 జంటలకు కళ్యాణమస్తు, షాది తోఫా ద్వారా రూ.27 లక్షల మెగా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని తహశీల్దారు లు త్వరిత గతిన భూమిలేని పేదలకు పట్టాలు, డికెటి భూములకు సెటిల్మెంట్ పట్టాలు పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు తాము అందిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత కలిగిన అక్రిడిటేషన్ జర్నలిస్టులకు 3 సెంట్లు ఇంటి పట్టాలు మంజూరు ను వేగవంతం చేయాలని సూచించారు. భూ పంపిణీ లో ఎక్కడా లంచాలకు తావు లేకుండా అధికారులు పారదర్శకతను పాటించాలని, అర్హులైన లబ్ది దారులకు మాత్రమే భూమి అందేలా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తహశీల్దారు మధుసూదన్ రావు, ఎంపిడివో శ్రీనివాసుల, పార్టీ అధ్యక్షుడు కే చలపతి రాజు ,రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రమేష్ రాజు ,సుబ్రమణ్యం రెడ్డి, తొపాయ్య,పాల పద్మనాభం, మోహన్ ,బాబు రెడ్డి, వెంకటేష్, శోబాన్ బాబు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితాను తయారు చేయాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం: రానున్న శాసనసభ ఎన్నికలకు ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని రామచంద్రాపురం మండల అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ జి చిన్న వెంకటేశ్వర్లు కోరా రు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్వో లతో ఓటర్ల జాబితా తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను బిఎల్వోలు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని హెచ్చరించారు. మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, అనర్హుల ఓట్లను, డబుల్ ఎంట్రీలు, గ్రామాలలో నివాసం లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను పక్క ఆధారాలతో తొల గించాలని ఆదేశించారు. చంద్రగిరి నియోజక వర్గంలో ఎక్కువ దొంగ ఓట్లు నమోదు చేశారని జిల్లా ఎన్నికల అధికారికి రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదులపై ఫిర్యాదులు చేస్తు న్నారు. ఆ ఫిర్యాదులపై కూడా బి ఎల్ వో లు సమగ్ర విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశిం చారు. ఓటర్ల జాబితా తయారీలో బిఎల్వోలు నిర్లక్ష్యం వహించిన, రాజకీయ పార్టీలపై పక్షపాతం చూపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారం 6, ఫారం 7 లను క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టి సిఫార్సు లు చేయాలని, దొంగ ఓట్లు నమోదుకు సిఫార్సులు చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ కృష్ణమ్మ, బి ఎల్ వో లు సిద్దయ్య, వర్మ, బాబు ఖాన్, చిరంజీవి, గీత పాల్గొన్నారు.

పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజాసంబంధాల వ్యాప్తి కోసం ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించినందుకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్‌కు జాతీయ స్థాయిలో అవార్డు లభించిందని తిరుపతి చాప్టర్ కార్యదర్శి చంద్ర మోహన్ తెలిపారు. న్యూఢిల్లీలోని జన్‌పథ్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 45వ అంతర్జాతీయ ప్రజాసంబంధాల ఉత్సవం ముగింపు కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ డాక్టర్ సోనాల్ మాన్‌సింగ్ చేతులమీదుగా ఈ అవార్డును తిరుపతి చాప్టర్ ఛైర్మన్ శ్రీనివాసరావు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ అంబాసిడర్ రాజశేఖర్, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాథక్, ఉపాధ్యక్షుడు యుఎస్.శర్మ, సెక్రటరీ జనరల్ పిఎల్‌కె.మూర్తి పాల్గొన్నారు. పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ గత 30 సంవత్సరాలుగా ప్రజాసంబంధాలల్ వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తోందని, పలు సంస్థల పిఆర్వోలకు వృత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇంజినీరింగ్, ఐటి, మేనేజ్‌మెంట్ విద్యార్థులతోపాటు వివిధ సంస్థల ఉద్యోగులకు ప్రజాసంబంధాల ప్రాముఖ్యతను తెలియ జేస్తు న్నామన్నారు. ఈ జాతీయ అవార్డు రావడం పట్ల

టీటీడీ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ టి.రవి, పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక ఛైర్మన్ సి.రమాకాంతశర్మ, కార్యదర్శి డి.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్‌రావు, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, మాజీ ఛైర్మన్లు స్వరాజ్యలక్ష్మి, ఎన్.బి.సుధాకర్ రెడ్డి, ఆచార్య త్రిపురసుందరి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్‌సికె.రాజులకు అభినందనలు తెలిపారు.

ఎంత వెతికినా అభివృద్ధి జాడ లేదు: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'పల్లెల్లో ఎంత వెతికినా అభివృద్ధి జాడ కనపించలేదని ఇదీ జగన్ పాలన తీరు..' అంటూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు విమర్శించారు. తొట్టంబేడు మండలంలోని సాంబయ్యపాలెం గ్రామంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో చలపతి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి ఎంత వెతికినా కానరాలేదంటూ విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు.

చిట్టిబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సి.చిట్టిబాబుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి మూడే దామ్లా నాయక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక విభాగం విశ్రాంత ఆచార్యులు కోదండరామిరెడ్డి పర్యవేక్షణలో 'ప్రాబ్లమ్స్ ఆఫ్ అగ్రికల్చరిస్ట్స్ ఇన్ సెలెక్టెడ్ విలేజెస్ ఆఫ్ చిత్తూర్ డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను సి.చిట్టిబాబుకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు ఆయన వెల్లడించారు. చిట్టిబాబు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. చిట్టిబాబుకు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతి జిల్లాలో దొంగ ఓట్లను నివారించాలి: టిడిపి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సహకారంతో భారీగా దొంగఓట్లు నమోదు చేశారని, తక్షణమే ఓటింగ్ తొలగించాలని టిడిపి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో చంద్రగిరి, తిరుపతి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గం ఇన్‌ఛార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకట రమణారెడ్డికి వివరించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో గొల్ల నరసింహ యాదవ్ మీడియా పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఒక్కొక్క నియోజకవర్గంలో సుమారు 25 నుంచి 35 వేలఓట్ల వరకు దొంగఓట్ల జాబితాగా దీనిపై అధికారులు వెంటనే చర్య తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర ఎన్నికల అధికారులకు అదేవిధంగా కేంద్ర ఎన్నికల అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుంటే ప్రజాపోరాటం కొనసాగిస్తామని హెచ్చ రించారు.

మహిళా వర్సిటీ యుఎన్ ఏపిసిఐసిటి, ఈఎస్‌సిఏపితో అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం యుఎన్ ఏపిసిఐసిటి, ఈఎస్సిఏపితో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని వెల్లడించారు. లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేశాయి. వర్చువల్ సమావేశం రెండు రోజుల క్రితం నిర్వహించారు. ఈ లెటర్ ఆఫ్ ఇంటెంట్ భారతదేశంలోని మహిళా పారిశ్రామికవేత్తలు, ఇతర కమ్యూనిటీ లబ్ధిదారుల మధ్య డిజిటల్ నైపుణ్యాలను ప్రోత్సహించడానికి భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేస్తుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా యుఎన్ ఏపిసిఐసిటి, ఈఎస్సిఏపి డైరెక్టర్ డాక్టర్ కియోంగ్ కో మాట్లాడుతూ భారతదేశంలో వైఫై కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ఎస్పీఎంవివి ఒక ముఖ్యమైన భాగస్వామి అన్నారు. మలేషియాలో వైఫై ప్రోగ్రామ్ విస్తరణలో ఎస్పీఎంవివి సహకారాన్ని కూడా ఆయన అభినందించారు. భారతదేశంలో వైఫై 2.0 అమలుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దేవురు భారతి తెలిపారు. యూనివర్సిటీ యువత, మహిళలకు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలపై ఏపీసిఐసిటితో సహకరిస్తుందని ఆమె వివరించారు. ఎస్పీఎంవివికి సహకరిం చినందుకు ఏపీసిఐసిటికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డీన్ ఆచార్య విజయలక్ష్మి, మాజీ విసి, వైఫై కోర్ మెంబర్ ప్రొఫెసర్ వి దుర్గా భవాని, ఎపిసిఐసిటి ప్రోగ్రాం ఆఫీసర్ నువాంకే వాంగ్చావాచై, సిఐఆర్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్ ఉష పాల్గొన్నారు.

గిరిజనుల తాగునీటి సమస్యకు పరిష్కారం

గిరిజనులకు తాగునీటిని అందిస్తున్న కలవగుంట భరత్‌రెడ్డి

ప్రజాశక్తి -తొట్టంబేడు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి గిరిజనుల దాహార్తిని తీర్చారు. ఎంతో గొప్ప మనసుతో తమ దాహార్తి తీర్చిన కలవ గుంట భరత్ రెడ్డిని గిరిజనులు అభినందించారు. తొట్టంబేడు మండలం శేషమనాయుడుకండ్రిగ పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో 70 కుటుంబాల గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరు గత కొంత కాలంగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వీరు తాగే నీటిలో క్లోరిన్ శాతం అధికంగా ఉండటంతో రైతుల పొలాల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇక్కడ బోర్లు వేసినా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులోకి బోరు ద్వారా మురుగునీరు కలుస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ఈ సమస్య పలు పర్యాయాలు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వారు తాగునీటి కోసం రైతుల పొలాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమస్య పత్రికల్లో ప్రచురితం కావడంతో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి స్పందించారు. శేషమనాయుడు కండ్రిగ గిరిజనులకు ట్యాంకు ద్వారా మినరల్ వాటర్ పంపి సమస్యను పరిష్కరించారు. అధికారులు స్పందించి శేషమ నాయుడు కండ్రిగ గిరిజనుల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన కోరారు.

నేడు డిగ్రీ విద్యార్థులకు సివిల్స్ గ్రూపు పరీక్షలపై అవగాహన

శ్రీ వేమ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని శ్రీ వేమ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈనెల 29వ తేదీన సివిల్స్ గ్రూపు పరీక్షలతో పాటు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు శ్రీ వేమ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేమ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో తిరుపతి గిండీస్ ఐఏఎస్ అకాడమీ నుండి వస్తున్న గిండీ సురేష్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలలో చదువుతున్న, చదివిన విద్యార్థులు సివిల్స్ గ్రూప్స్ అవగాహన సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇలాంటి అవగాహన సదస్సులతో విద్యార్థుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు, వాటి అర్హత పరీక్షలపై అవగాహన పెరిగి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెఎస్ గిరిబాబును పరామర్శించిన తుడా చైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామచంద్రాపురం మండలం నెత్త కుప్పం పంచాయతీ.. ఎల్‌వి పురానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ కెఎస్ గిరిబాబును తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిబాబుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు తుడా చైర్మన్ సూచించారు. సర్జరీ చేయాల్సి ఉందని డాక్టర్లు మోహిత్ రెడ్డికి తెలిపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గిరిబాబు తండ్రి, వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులను మోహిత్ రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. తిరుపతి క్రైమ్ బ్రాంచ్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గిరిబాబు సోమవారం రాత్రి బైక్ లో వెళుతూ మడపం పల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. మోహిత్ రెడ్డి వెంట కొత్తవేప కుప్పం సర్పంచ్ బోడిరెడ్డి హిమాల్ రెడ్డి ఉన్నారు.

8 నుండి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని అంగన్‌వాడీ టీచర్స్ ఫెడరేషన్ తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఎగిడ్డయ్య కి మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న ఈ నిరవధిక సమ్మె లో అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలి: ఎంపీపీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సచివాలయాలలోనే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పుత్తూరు ఎంపీపీ మునివేలు తెలిపారు. మంగళవారం పుత్తూరు లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగకుండా, తమ గ్రామంలోని సచివాలయాలలోనే పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధ లు కూడా ప్రజలకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో ప్రతిపక్ష నాయకులు గైర్హాజరు కావడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించేవారు లేకపోవడం తో సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. కాగా వివిధ శాఖాధికారులు, తమ పరిధిలోని ప్రభుత్వ పథకాలు గురించి, అవ లవుతున్న పనులు గురించి వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, ఎంపీడీవో ప్రసాదావు, తహసీల్దారు పరమేశ్వరావు, సీడీపీవో పద్మజ, ఏవో లు కోదండయ్య, సౌజన్య, ఏఈ రవిచంద్ర, ఆర్టీసీ ఎస్ జె పెరుమాల్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడులో యూనియన్ బ్యాంకు వద్ద తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ప్రమాదాల నివారణకు నడుం బిగించారు. ఏర్పేడు లో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు వన్‌వే కోసం మధ్యలో సిమెంట్ రాళ్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల రోడ్డు దిగే సమయంలో తరచూ ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ప్రమాదాలు నివారణకు ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా అధికారులు ఎవరూ స్థానికంగా కనిపించడం లేదు. దీంతో సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య రోడ్డు పల్లంగా ఉన్న ప్రదేశంలో మట్టి తొలగించి జెసిబి సహాయంతో చదును చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు శివయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.3.80 కోట్లతో వల్లివేడు అభివృద్ధి: నేదురుమల్లి

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : రూ.3.80 కోట్లతో వల్లివేడులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంగళవారం వల్లివేడ్లో నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్?' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని, వైఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు భూ పంపిణీ చేశారని, వారి పాలనలో తమ తల్లి రాజ్యలక్ష్మి మంత్రిగా ఉన్నప్పుడు వల్లివేడుకి 200 ల ఎకరాలకు వ్యవసాయ భూమికి పట్టాలు ఇచ్చారని , జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు కేతిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వల్లివేడు సర్పంచ్ కే నిర్మల, వైస్ ఎంపీపీ వీరి.పెంచలయ్య, ఎంపీటీసీలు జై వరమ్మ, పుల్లూరు శ్రీదేవి, వైసిపి నాయకులు బర్రి రామచంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, రాజారెడ్డి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రమాద వశాత్తు ట్రక్ ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. జయంపు కోటంబేడు రోడ్డు మార్గం తెలుగు గంగ కాలువ సమీపం వద్ద ఈ ప్రమాదం జరిగింది. బంధువులు కథనం మేరకు.. ఓజిలి మండలం కర్ర బొల్లువోలు గ్రామానికి చెందిన ట్రక్ ఆటో మండలంలోని జయంపు గ్రామానికి బాడుగ నిమిత్తం వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో స్పృహ కోల్పోయాడు.

మానవత్వం చాటుకున్న వెందోటి

మండలంలోని పెరమిడ్ గ్రామం నుంచి జయంపు గ్రామం కు వస్తున్న వైసిపి మం డల అధ్యక్షుడు, జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి 108 వాహనంకు ఫోన్ చేశారు. బంధువులకు సమాచారం ఇచ్చి బంధువు లకు అప్పగించారు.

SPECIAL COURT - II
BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT TIRUVALUR
M.C.O.P.NO: 163 OF 2023

S. Arulraj ..... Petitioner
VS
1. D. Naga Sidda Reddy
2. The Manager
The New India Assurance Co.Ltd.
..... Respondents

To
D. Naga Sidda Reddy, S/o. Late. D. Sidda Reddy, D.No.3-237, S.N.Puram, Rajiv Nagar, Tirupati, Andhra Pradesh State - 517501.
Sir,
The Above M.C.O.P. was filed by the petitoners against you before the SPECIAL COURT - II, Tiruvallur and ordered notice to you returnable by 19.12.2023, please take notice that the above M.C.O.P. Case was posted on 19.12.2022 for your appearance and appear on that day at 10.30 am, either. In person or through your counsel. Failing which the matter will be called in Your absence and decided on merits

Mr. J. SARAVANAN, B.Sc, B.L.,
Counsel for the Petitoners

DRAVIDIAN UNIVERSITY
SRINIVASAVANAM KUPPAM - 517 426.
" e- Procurement Tender Notice"

DU/ Tender NIT Nos 04 & 05 / DU / Engg /2023 - 2024
Dated. 18.11.2023 & 24.11.2023

1. Tenders are invited from authorized firms/ Dealers for Purchase of Equipments from RUSA funds like Desktop computers, Scanners and Printers at an approximate estimated cost of Rs. 36.00 Lakhs
2. Tenders are invited from the reputed Software Companies for implementation of the Automation of Online Examination process work for regular UG / PG / Programs. Further details can be seen at e-procurement market place at https://www.apeprocurement.gov.in

REGISTRAR